

విద్యార్థుల సంఖ్య ఆధారంగా పని సర్దుబాటు చేయాలని వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జులై 31 నాటి విద్యార్థుల సంఖ్య ఆధారంగా పాఠశాలల్లో పని సర్దుబాటు చేయాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడి వేదిక ఆధ్వర్యాన డిప్యూటీ డిఇఒ వెంకటరమణకు వినతి అందించారు. డిజిటల్ పాఠ్యాంశ ప్రణాళికలు అనుమతించాలని కోరారు. ఉపాధ్యాయ సంఘాలతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా అదనపు సెక్షన్లు నిర్వహిస్తున్న ప్రయివేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. స్పాట్ టీచర్స్ విషయంలో పిఇటి, పీడీలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డి.శ్యామ్ (ఎస్‌టియు), రవీంద్రనాయుడు (పిఆర్‌టియు), పి.శ్రీనివాసరావు (ఎపిటిఎఫ్-257), రామ్‌నాయుడు (ఆపస్), శ్రీనివాసరావు (ఎపిటిఎఫ్-1938), శంకర్ నాయుడు, రాము నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన కౌలురైతుల గుర్తింపు

- రుణసాయానికీ తిప్పలే
- ముంచుకొచ్చిన ఖరీఫ్



దెంకాడ మండలం పెదతాడివాడలో ఏర్పాటుచేసిన కౌలురైతుల గుర్తింపు గ్రామసభలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి విటి రామారావు (ఫైల్)

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లా వ్యాప్తంగా సుమారు 2.61 లక్షల మంది రైతులు ఉన్నట్టుగా అధికారులు చెబుతున్నారు. వీరిలో 2,58,324 మంది రైతులకు భరోసా అందుతోంది. మిగిలిన 3 వేల మంది పెద్ద రైతులు కాబట్టి రైతు భరోసా అందడం లేదు. ఇదీ చాలా కాలంగా సాగదీస్తున్న సర్కారు వారి లెక్క. కానీ, వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. జిల్లాలో దేవాదాయ శాఖ, మాన్సాస్ భూములు, మొకాసో, నాలా వారీ భూములు వేలాది ఎకరాలు ఉన్నాయి. ఇవన్నీ లీజుపద్ధతిలోనే సాగవుతున్నాయి. చిన్న, సన్నకారు రైతులు సాగుచేసుకుంటూ జీవనం వెళ్లదీస్తున్నారు. ఈ లెక్కన జిల్లాలోని మొత్తం రైతుల్లో సుమారు 90 వేల మంది (28 శాతం) కౌలురైతులు ఉన్నారని ఎపి రైతు సంఘం లెక్క. కౌలు రైతుల గుర్తింపు విషయంలో రెవెన్యూ శాఖ ఇందుకు పూర్తి భిన్నంగా లక్ష్యాన్ని తీసుకోవడం గమనార్హం. జిల్లా వ్యాప్తంగా 983 గ్రామాల్లో కౌలుదారులు ఉన్నారట. వీరిలో గతేడాది అప్పటి ప్రభుత్వం 12,816 మందికి మాత్రమే సిసిఆర్ కార్డులు అందజేశారు. ఈ ఏడాది 15,550 మందికి కార్డులు ఇవ్వాలని లక్ష్యం తీసుకున్నారు. ఇందులో ఇప్పటి వరకు 1162 కార్డులు మాత్రమే ఇచ్చారు. తీసుకున్న లక్ష్యమే తక్కువ. అందులోనూ పెట్టుబడికి సమయం ముంచుకొస్తోంది. ఇటువంటి తరుణంలో ఇంకా జాప్యం చేయడం పట్ల రైతుల్లో నిరాశ, అసహనం పెరుగుతోంది.

> **జిల్లాలో కౌలురైతుల గుర్తింపు నత్తనడకన సాగుతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రస్తుత ఖరీఫ్ పంటల సాగు పెట్టుబడి కోసం కౌలు రైతులంతా తిప్పలు పడాల్సిన దుస్థితి దాపురించనుంది. ఇప్పటికే ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. వేరుశనగ, నువ్వులు, పత్తి, మొక్కజొన్న వంటివి ఇప్పటికే సాగుచేయగా, వరి విత్తనాలు, ఎరువులు కొనుగోలు, దుక్కిపట్టి మడులు అదును చేయడం వంటి పనిలో రైతులు నిమగ్నమయ్యారు. అయినప్పటికీ కౌలురైతులను పూర్తిస్థాయిలో గుర్తించి, వారికి సిసిఆర్‌సి (క్రాప్ కల్టివేషన్ రైట్ కార్డు)లు జారీ చేయడంలో జాప్యమవుతోంది.**

బ్యాంకు రుణాలకు నిబంధనాలు

సిసిఆర్ కార్డులు ఉన్న కౌలుదారులకు బ్యాంకు రుణాలు ఇవ్వాలని కోరుతూ బ్యాంకులకు ఇప్పటికే జాబితాలను పంపామని రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. బ్యాంకు నిబంధనలు, ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్ల కౌలురైతులకు ఆచరణలో బ్యాంకు రుణం అందడం లేదు. పంట రుణాలకు వన్‌బి పత్రాలు, పట్టాదారు పాస్‌పుస్తకాలు తప్పనిసరి. సాధారణంగా ఆయా పత్రాలు భూమి యజమానులకే అందుబాటులో ఉంటాయి. రైతులు పంట రుణాల కోసం వచ్చినప్పుడు వన్‌బిలో ఉన్న మొత్తం భూమి విస్తీర్ణాన్ని హోల్డ్ చేసి నగదు చెల్లింపులు చేస్తామని సాక్షాత్తూ బ్యాంకు అధికారులే చెబుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో అదే ఖాతా నంబరుతో ఆ తరువాత కౌలుదారుడు వచ్చినా రుణసాయం అందించేందుకు అవకాశం ఉండదని కూడా చెబుతున్నారు. దీన్నిబట్టి ప్రభుత్వం రాష్ట్ర స్థాయిలో బ్యాంకు నిబంధనల సడలింపు కోసం ప్రయత్నించడం, లేదా ప్రభుత్వమే బ్యాంకర్లకు హామీ ఇవ్వడం వంటి చర్యలు తీసుకుంటే మినహా కౌలురైతులకు న్యాయం జరిగే అవకాశం కనిపించడం లేదు.

11న జిల్లాకు సిఎం రాక

- భోగాపురం ఎయిర్‌పోర్టు పనులు పరిశీలించనున్న చంద్రబాబు
- వెల్లడించిన కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు



ఎయిర్‌పోర్టు పనులను పరిశీలిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, కలెక్టర్, ఎమ్‌పి, ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-భోగాపురం

ఈ నెల 11న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లాకు రానున్నారు. ఉత్తరాంధ్ర పర్యటనలో భాగంగా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ పనులను పరిశీలించనున్నారు. గురువారం మధ్యాహ్నం 12.30 గంటలకు భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రాంతంలోని హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. 1.30 వరకు నిర్మాణ పనులను పరిశీలించి, సమీక్షిస్తారు. ఈ నేపథ్యంలో కేంద్ర పౌరవిమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు మంగళవారం భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రాంతంలో పర్యటించారు. జిఎంఆర్ సంస్థ చేపడుతున్న ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులను ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు లోకం మాధవి, అదితి గజపతిరాజుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిఎంఆర్ సంస్థ ప్రతినిధి రామరాజు ఈ పనులకు సంబంధించిన వివరాలను ఆయనకు తెలియజేశారు. ఇప్పటి వరకు 25 శాతం పనులు జరిగాయని తెలిపారు. ఎటిసి టవర్ నిర్మాణం చివరి దశలో ఉన్నట్లు వివరించారు. టెర్మినల్, రన్‌వే పనులను సైతం కేంద్రమంత్రి పరిశీలించారు. దీనికి సంబంధించిన వివరాలను మ్యాపుల ద్వారా అధికారులు ఆయనకు వివరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 11న సిఎం చంద్రబాబు భోగాపురం ఎయిర్‌పోర్టు పనులను పరిశీలిస్తారని చెప్పారు. విమానాశ్రయ భూసేకరణలో గత ప్రభుత్వ హయాంలో కొన్ని తప్పులు జరిగాయని స్థానిక నాయకులు ఫిర్యాదు చేశారని తెలిపారు. దీనిపై కలెక్టర్, స్థానిక ప్రజాప్రతినిధులు ఒక నిర్ణయం తీసుకుంటార న్నారు. కార్యక్రమంలో కలెక్టర్ అంబేద్కర్, జాయింట్ కలెక్టర్ కార్తిక్, ఆర్‌డిఒ సూర్యకళ, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు, నాయకులు కర్రోతు సత్యానారాయణ, కాకర్లపూడి శ్రీనివాసరాజు, కంది చంద్రశేఖర్, మట్టా అయ్యప్పరెడ్డి, బాల అప్పలరాజు, పతివాడ శ్రీనివాసరావు, మహంతి చిన్నం నాయుడు తదితర నాయకులు పాల్గొన్నారు.

కుష్టువ్యాధిని పూర్తిగా నిర్మూలించండి

కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ • 18 నుంచి ఆగస్టు 2 వరకు ఇంటింటి సర్వే



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో కుష్టువ్యాధిని పూర్తిగా నిర్మూలించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్... అధికారులను ఆదేశించారు. జిల్లాలో వ్యాధి వ్యాప్తికి కారణాలను గుర్తించి, వాటిని నివారించాలని సూచించారు. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా ఈ నెల 18 నుంచి ఆగస్టు 2 వరకు జిల్లాలో ఇంటింటి సర్వే చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంపై జిల్లా కలెక్టర్ తన ఛాంబర్‌లో మంగళవారం వివిధ శాఖల అధికారులతో సమన్వయకమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కుష్టువ్యాధి వ్యాప్తి చెందడానికి వీల్లేదని స్పష్టం చేశారు. వ్యాధిని సంపూర్ణంగా నిర్మూలించేందుకు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం ద్వారా వ్యాధిని చాలావరకు అరికట్టవచ్చునని, వ్యాధిగ్రస్తులను ముందుగానే గుర్తించవచ్చునని సూచించారు. దీనికోసం వివిధ ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ఈ వ్యాధి కారణాలు, చికిత్స, నివారణ చర్యలను ప్రజలకు వివరించాలని కోరారు. మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలల్లో ప్రతి విద్యార్ధినీ తనిఖీ చేసి, స్పర్శ లేని మచ్చలు, ఇతర లక్షణాలు ఏమైనా ఉంటే గుర్తించాలన్నారు. కుష్టువ్యాధిని ముందుగానే గుర్తించడం ద్వారా అంగవైకల్యాన్ని నివారించవచ్చునని చెప్పారు. ఈ వ్యాధిని ఎండిటి చికిత్సతో పూర్తిగా నయం చేయవచ్చునని సూచించారు. జిల్లాలోని ప్రతి ఇంటిలో సర్వే జరగాలని స్పష్టం చేశారు. కేవలం మన ప్రాంతంలోనే ఈ వ్యాధిగ్రస్తుల సంఖ్య ఎక్కువగా ఉండటానికి తగిన శాస్త్రీయ కారణాలను అన్వేషించాలని సూచించారు. జిల్లా ఆసుపత్రులు కూడా తమ వద్దకు వచ్చే రోగుల్లో కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించి, చికిత్స అందించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. సర్వే కోసం ఇంటివద్దకు వచ్చే ఆశావర్కర్లు, వైద్య సిబ్బందికి ప్రజలు పూర్తిగా సహకరించాలని కోరారు.

సమావేశంలో జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి ఎస్.భాస్కరరావు, జిల్లా కుష్టు నియంత్రణాధికారి రాణి, జెడ్‌పి సిఇఒ శ్రీధర్‌రాజా, డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ ఎం.ఎం.నాయుడు, మెప్మా పీడీ సుధాకరరావు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

కుష్టువ్యాధి అవగాహన పోస్టర్ విడుదల

కుష్టువ్యాధి అవగాహన పోస్టర్‌ను డిఎంహెచ్‌ఒ కార్యాలయంలో డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు విడుదల చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయనమ మాట్లాడుతూ కుష్టువ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ఈ నెల 18 నుంచి చేపట్టే సర్వేను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నివారణ అధికారి డాక్టర్ కె.రాణి, డాక్టర్ ఆర్.అచ్యుతకుమారి, డిఐఒ డాక్టర్ వివిబి సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ రీఛార్జి ధరలు తగ్గించాలని రాస్తారోకో



రాస్తాకోకో చేస్తున్న సిఐటియు నాయకులు, పట్టణ ప్రజలు

ప్రజాశక్తి-బొబ్బిలి

పెంచిన మొబైల్ రీఛార్జి ధరలు తగ్గించాలని కోరుతూ సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు ఆధ్వర్యాన బొబ్బిలి పట్టణంలో మంగళవారం రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ కేంద్రంలో మోడీ మూడోసారి పీఠం మీద కూర్చున్నాక కొద్ది రోజులకే ప్రయివేటు టెలికాం కంపెనీలు మొబైల్ రీఛార్జి ధరలను భారీగా పెంచి ప్రజలపై 20 వేల కోట్ల రూపాయల భారాన్ని మోపాయన్నారు. నిర్వహణ వ్యయానికి తగ్గట్టుగా ధరలు పెంచడం అనివార్యమైందని ఆ కంపెనీలు ప్రకటించినా, జనం మొబైల్ అవసరాన్ని లాభాల మూటలుగా మార్చుకోవటమే వాటి అసలు ఉద్దేశమని తెలిపారు. కార్పొరేట్ కంపెనీల వద్ద వేల కోట్ల రూపాయలు పార్టీ ఫండ్ తీసుకొని ఎన్నికల్లో విస్తారంగా ఖర్చు పెట్టి బిజెపి అధికారంలోకి వచ్చిందని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వం కుట్రపూరిత వైఖరి, కార్పొరేటర్లకు దోచిపెట్టే ధోరణి.. ఈ ప్రొవైడర్ల దోపిడీకి మార్గం సుగమం చేస్తున్నాయని విమర్శించారు. కుట్రపూరితంగా బిఎస్‌ఎన్‌ఎల్‌ను కూలదోసి కార్పొరేట్ కంపెనీలకు రకరకాల రాయితీలతో, అవకాశాలతో విస్తరించే భూమికను ఏర్పరిచిందని ధ్వజమెత్తారు. మొబైల్ రీఛార్జి భారాన్ని వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా జనసేన, టిడిపిలు.. బిజెపి, కార్పొరేట్ కంపెనీల వైపు ఉంటాయా? ప్రజల వైపు ఉంటాయా తేల్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి.యుగంధర్, జి.గౌరీ, కార్మికులు పాల్గొన్నారు.

ఆగస్టు 16 నుంచి 19 వరకు

రాష్ట్ర బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్

జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు కె.ఎ.నాయుడు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆగస్టు 16 నుంచి 19 వరకు విజయనగరం జిల్లా కేంద్రంలో రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు కె.ఎ.నాయుడు, కార్యదర్శి నున్నా సురేష్ తెలిపారు. మంగళవారం స్థానిక ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టులో జరిగే రాష్ట్ర పోటీల్లో విజేతలుగా నిలిచిన వారిని ఉత్తరప్రదేశ్‌లో జరిగే బ్యాడ్మింటన్ పోటీలకు పంపిస్తామని చెప్పారు. డిఎస్‌ఎ క్రీడా మైదానం అభివృద్ధికి మంత్రి లోకేష్‌ని కలిసి విన్నవిస్తామన్నారు. శిక్షకులను తొందరలో నియమించేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు.

జిల్లా స్థాయి పోటీలు ఈ నెల 18 నుంచి 11, 13 ఏళ్ల వారికి, 19న 14, 15 ఏళ్ల వారికి, 20న యూత్, 21న వెటరన్స్‌కి పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో విజేతలు రాష్ట్ర పోటీలో పాల్గొనున్నారని తెలిపారు. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు డాక్టర్ వి.ఎస్ ప్రసాద్, కుసుమ బచ్చన్, మల్లికార్జునరావు, నాయకులు పాల్గొన్నారు.

సరికొత్త ఫీచర్లతో ఇపిడిసిఎల్ యాప్

ఎస్‌ఇ ఎం.లక్ష్మణరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపిఇపిడిసిఎల్) ఈస్టర్న్ పవర్ మొబైల్ యాప్‌ను సరికొత్త ఫీచర్లతో వినియోగదారులకు అందుబాటులోకి తీసుకువచ్చిందని విజయనగరం సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎం.లక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలిపారు. గూగుల్‌ప్లే స్టోర్ నుంచి 'ఈస్టర్న్ పవర్' మొబైల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకొని వినియోగదారులు 16 అంకెల సర్వీసు నంబర్ నమోదు చేసుకోవడం ద్వారా సేవలను పొందవచ్చని చెప్పారు. ఈస్టర్న్ పవర్ మొబైల్ యాప్‌లో 'బిల్ పే' ఆప్షన్ ద్వారా ద్వారా విద్యుత్తు బిల్లులను ఎటువంటి అదనపు రుసుమూ లేకుండా అత్యంత సులభతరంగా చెల్లించవచ్చని తెలిపారు. అంతేకాకుండా వినియోగదారుని సర్వీసుకు సంబంధించిన విద్యుత్తు వినియోగం, బిల్లు వివరాలు, చెల్లింపు, విద్యుత్తు సరఫరా పరిస్థితి వివరాలు తెలుసుకోవచ్చని చెప్పారు. 'మై యుసెజ్' ఆప్షన్ ద్వారా విద్యుత్తు మీటర్‌లో ఉన్న రీడింగ్ ప్రకారం కేవలం ప్రస్తుత వినియోగపు యూనిట్ల సంఖ్యను నమోదు చేయడం ద్వారా విద్యుత్తు బిల్లును వినియోగదారులే యాప్ ద్వారా లెక్కించుకోవచ్చని చెప్పారు. యాప్ ద్వారా ఆధార్ నంబర్‌కు విద్యుత్తు సర్వీసును అనుసంధానం చేసుకోవడంతోపాటు విద్యుత్తు సంబంధిత సమస్యలను ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. పేటిఎం, ఫోన్‌పే, గూగుల్ పేతో సహా ఇతర యుపిఐ యాప్‌ల ద్వారా బిల్లులు నేరుగా చెల్లించే విషయమై ఆర్‌బిఐ అభ్యంతరం వ్యక్తం చేసినా, పాత విధానంలోనే నేరుగా వాటి ద్వారా వినియోగదారులు బిల్లులు చెల్లించేందుకు వీలుగా బ్యాంకులతో సంప్రదింపులు జరుపుతున్నామని వెల్లడించారు. సంస్థ వెబ్‌సైట్ www.apeasternpower.com నుంచి కూడా బిల్లులు చెల్లించవచ్చని చెప్పారు. ఎపిఇపిడిసిఎల్ మొబైల్ యాప్‌లో గాని లేదా సంస్థ వెబ్‌సైట్‌లో గాని బిల్లులు చెల్లించేటప్పుడు వినియోగదారులు తమ ఫోన్‌పే, గూగుల్ పే, పేటిఎం, ఇతర యుపిఐ యాప్‌లతోపాటు నెట్ బ్యాంకింగ్, డెబిట్, క్రెడిట్, వాలెట్స్, క్యాష్ కార్డులు కూడా వాడుకోవచ్చని ఎస్‌ఇ తెలిపారు.

పారిశుధ్య నిర్వహణపై రాజీవద్దు

కమిషనర్ ఎం.ఎం.నాయుడు



రోడ్డుపై చేరిన మురుగునీటిని పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో పారిశుధ్య పనులను సక్రమంగా చేయాలని, ఎటువంటి అలసత్వం వహించినా ఉపేక్షించేది లేదని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.ఎం.నాయుడు హెచ్చరించారు. మంగళవారం నగరంలో 28వ డివిజన్‌లో పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. వర్షాకాలం నేపథ్యంలో పారిశుధ్య పనులు విషయంలో అలసత్వం వహించవద్దన్నారు. కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ దోమల నివారణకు పిచికారీ చేసి, అన్ని ప్రాంతాల్లో ఫాగింగ్ చెయ్యాలని ఆదేశించారు. ప్రజలు కూడా మురుగునీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకునే విధంగా శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కంటుభుక్త తవిటిరాజు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల జలమయం కాకుండా చర్యలు

లోతట్టు ప్రాంతాలు జలమయం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి కమిషనర్ ఎం.ఎం.నాయుడు ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం 24వ డివిజన్ ప్రాంతంలో పర్యటించి అక్కడ నెలకొన్న సమస్యలను గుర్తించారు. ముఖ్యంగా అక్కడ ఉన్న ప్రధాన కాలువలో నీరు నిలిచిపోవడంతో మురుగునీరు రోడ్లపైకి రావడానికి గమనించారు. తక్షణం సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సమస్య తీవ్రతరం అవుతున్నా నిర్లక్ష్యంగా వ్యవహరించిన శానిటరీ కార్యదర్శి, పారిశుధ్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇటువంటి నిర్లక్ష్య ధోరణి పునరావృతం అయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. స్థానిక కార్పొరేటర్ కంటుభుక్త తవిటిరాజు సమస్య తీవ్రతను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. తక్షణమే కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారాలను తొలగించి నీరు ప్రవహించే విధంగా చేస్తామని కమిషనర్ చెప్పారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలని

ఎపిజిఇఎ ఆధ్వర్యాన ఉద్యోగుల ర్యాలీ



ర్యాలీ చేపడుతున్న ఎపిజిఇఎ నాయకులు, ఉద్యోగులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎపిజిఇఎ రాష్ట్ర అధ్యక్షులు కె.ఆర్.సూర్యనారాయణపై గత ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని కోరుతూ ఎపిజిఇఎ ఆధ్వర్యాన ఉద్యోగులు మంగళవారం ర్యాలీ చేపట్టారు. ఎపిజిఇఎ జిల్లా కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం డిఆర్‌ఒకి వినతిపత్రాన్ని అందించారు. అక్రమ కేసులు బనాయించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఎపిజిఇఎ జిల్లా అధ్యక్షులు కె.వెంకటరమణ, కార్యదర్శి బి.బాల భాస్కరరావు, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ పువ్వల శ్రీనివాసరావు, అర్బన్ అధ్యక్ష, కార్యదర్శులు చింతల వెంకట సతీష్, బియ్యాల చంద్రశేఖర్, జిల్లా ఉపాధ్యక్షులు బాలాజీ పాణిగ్రాహి, పి.ఆర్.అనిల్‌కుమార్, ఎన్.వెంకటేశ్వరరావు, జాయింట్ సెక్రెటరీలు లెంక సత్తిబాబు, పి.మేరీ, రాష్ట్ర కార్యదర్శి ఎల్.వై.యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.

నీటి పన్ను బకాయిలపై ఉపేక్షించేది లేదు

ఇఇ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నీటి పన్ను బకాయిలను ఉపేక్షించబోమని నగరపాలక సంస్థ ఇఇ కె.శ్రీనివాసరావు అన్నారు. దీర్ఘకాలంగా నీటి పన్ను చెల్లించని వినియోగదారుల కుళాయిలను నిలుపుదల చేస్తామని స్పష్టం చేశారు. కమిషనర్ ఎం.ఎం.నాయుడు ఆదేశాల మేరకు మంగళవారం 28వ నంబర్ సచివాలయ పరిధిలో నీటి బకాయి పేరుకుపోయిన వినియోగదారుల కుళాయి కనెక్షన్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా ఇఇ శ్రీనివాసరావు మాట్లాడుతూ నీటి పంపిణీకి ఎంతో వ్యయ, ప్రయాస అవుతోందన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రతిఒక్కరూ నీటి వినియోగదారులు తప్పనిసరిగా సకాలంలో పన్నులను చెల్లించాలన్నారు. లేకుంటే నీటి సరఫరాను నిలుపుదల చేస్తామని తెలిపారు. నీటిని వృథా చేయకుండా ఆన్, ఆఫ్ స్విచ్‌లను తప్పనిసరిగా వినియోగించాలని కోరారు. నీటి వినియోగాన్ని జాగ్రత్తగా చూసుకోవాలన్నారు.

2165 టన్నుల ఇసుక ఉచితంగా సరఫరా

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో వినియోగ దారులకు ఉచితంగా ఇసుక సరఫరా కార్యక్రమంలో భాగంగా మూడు ఇసుక నిల్వ యార్డుల ద్వారా 2165 టన్నుల ఇసుక సరఫరా చేసినట్లు గనుల శాఖ ఉప సంచాలకులు సూర్యచంద్రరావు తెలిపారు. డెంకాడ మండలం పెదతాడివాడ నిల్వ కేంద్రం నుంచి 1336.5 మెట్రిక్ టన్నులు, కొత్తవలస నుంచి 819 మెట్రిక్ టన్నులు, బొబ్బిలి నుంచి 10 మెట్రిక్ టన్నులు సరఫరా చేసినట్లు చెప్పారు.

నేడు, రేపు సాగర్ కవచ్


ప్రజాశక్తి-భోగాపురం

సముద్ర మార్గం నుంచి చొరబాటుదారులు రాకుండా ఉండేందుకు సాగర్ కవచ్ నిర్వహిస్తున్నట్లు సిఐ ఎ.రవికుమార్ తెలిపారు. బుధవారం నుంచి రెండు రోజులు పాటు ఈ కార్యక్రమం జరుగుతుందని వెల్లడించారు.

ప్రతి కౌలురైతుకూ కార్డు

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

ప్రతి కౌలు రైతుకు కౌలు కార్డు మంజూరు చేస్తామని వ్యవసాయ శాఖ ఎడిఎ యం.శ్యాంసుందర్ తెలిపారు. మంగళవారం కలవరాయి గ్రామంలో కలవర రైతు సేవా కేంద్రంలో గ్రామ సర్పంచ్ అధ్యక్షతన కౌలు రైతుల గుర్తింపు కార్యక్రమం, గుర్తింపు కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా కలవరాయి పంచాయతీ గల కౌలు రైతులను గుర్తించి వారికి కౌలు కార్డులను మంజూరు చేయడానికి వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. అర్హులైన కౌలు దారులకు రెవెన్యూ అధికారి ద్వారా కౌలుదారు కార్డులను జారీ చేసి వీటి వల్ల ఉపయోగాలను, లాభాలను వివరించాలన్నారు. ఈ సంవత్సరానికి కనీసం 70 మంది కౌలు రైతులను కలవరాయి గ్రామంలో గుర్తించాలని వ్యవసాయ, రెవెన్యూ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంతో పాటుగా కలవరాయ గ్రామంలో రైతు సేవా కేంద్ర వద్ద వేస్ట్ డీకంపోజర్ విధానంలో సేంద్రీయ ఎరువుని ఏ విధంగా తయారు చేయాలనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సేంద్రియ ఎరువు వల్ల ఎటువంటి రసాయనాలు వాడకుండా పంటలు పండించగలమని రైతులకు అవగాహన కల్పించారు. కలవరాయి గ్రామంలో ఈ దఫా ఎక్కువగా మొక్కజొన్న పంట వేయటం వల్ల మొక్కజొన్న పొలాలను కూడా పరిశీలించారు. ఈ పొలాల్లో ఉన్న తెగుళ్ల ఉధృతి, కలుపు నివారణకు చేపట్టవలసిన చర్యలపై రైతులకు సూచనలు సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామ సర్పంచ్, ఎంపిటిసిలు, గ్రామ రైతు సేవా కేంద్రం రవళి తదితరులు పాల్గొన్నారు.



బొబ్బిలిరూరల్: కౌలు కార్డులను పంపిణీ చేస్తున్న ఎడిఎ శ్యాంసుందర్

కౌలు రైతుకు గుర్తింపు కార్డు తప్పనిసరి

బాడంగి: కౌలు రైతు గుర్తింపు కార్డు తప్పనిసరిగా పొందాలని కోటిపల్లి సచివాలయం వ్యవసాయ సహాయకులు ఎగిరెడ్డి అనూష, విఆర్ఒ గొట్టపు రమేష్ అన్నారు. మంగళవారం మండలంలోని ఆకులకట్ట గ్రామంలో కౌలు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంట రుణాలు, ఈ- పంట నమోదు, అన్నదాత సుఖీభవ, పంట నష్టపరిహారం, పంటల భీమా పంట కొనుగోలు, రాయితీపై వ్యవసాయ పరికరాలు కౌలు రైతులకు సైతం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉయ్యాలా సత్యనారాయణ, టిడిపి నాయకులు రావిపల్లి సింహాచలం రైతులు పాల్గొన్నారు.

కొత్తవలస: సాగు భూమిని కౌలుకు తీసుకొని సాగు చేస్తున్న రైతులు తప్పనిసరిగా గుర్తింపు కార్డు పొందాలని, అటువంటి వారికి ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు అన్ని వర్తిస్తాయని అధికారులు తెలిపారు. మంగళవారం కౌలు రైతుల గుర్తింపు కోసం కంటకాపల్లి సచివాలయం వద్ద రెవెన్యూ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకుడు సమక్షంలో సభ నిర్వహించారు. ఈ కౌలు కార్డు పొందిన రైతులు వ్యవసాయ సబ్సిడీ మీద అందచేస్తున్న పథకాలు, బ్యాంక్ రుణాలు, అన్నదాత సుఖీభవ వంటి పథకాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మాధవీ లత, విఆర్ఒ కాకర మల్లేశ్వరరావు, గ్రామ ఉద్యాన సహాయకుడు రవి ప్రకాష్, నాయకులు ఎం. కాశీ విశ్వనాథం, బోదల వెంకట రమణ, బాదిరెడ్డి రమణ రైతులు పాల్గొన్నారు.

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో సౌకర్యాలు మెరుగు

జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

జిల్లాలో గల ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల గిరిజన విద్యార్థుల కోసం ఆశ్రమ పాఠశాలలలో సౌకర్యాలను మరింత మెరుగు పరుస్తామని జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి రమణానందం అన్నారు. మంగళవారం పట్టణంలోని సాయిబాబా గుడి వెనుక గల గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు దోమల బారిన పడకుండా కిటికీలకు ఇనుప మెస్సలను ఏర్పాటు చేశామని, హుదూద్ తుఫాను సమయంలో పాడైన సిమెంట్ రేకులను సరి చేశామని చెప్పారు. వసతి గృహంలో గల ఆరో ప్లాంట్‌ను ఆయన పరిశీలించారు. గిరిజన వసతి గృహాల మెరుగునకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలను చేస్తుందని విద్యార్థులకు చదువుతోపాటు సరైన మౌలిక సౌకర్యలకు భంగం కలగకుండా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం గణపతి రావు, హాస్టల్ వార్డెన్ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

19వ రోజుకు రిలే నిరాహార దీక్షలు

కొత్తవలస: జిందాల్ కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 19వ రోజుకి చేరింది. జిందాల్ యాజమాన్యం లే ఆఫ్ పేరుతో కార్మికులను బయటికి నెట్టి నేటికి 54 రోజులు గడుస్తుండగా అప్పటి నుంచి నిరసన చేస్తున్నా పట్టించుకోకపోవడం సిగ్గుచేటని కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. 40 సంవత్సరాల నుంచి పని చేస్తున్న కార్మికులను ఎటువంటి కారణం లేకుండా లే ఆఫ్ పేరుతో కంపెనీ బయట ఉంచడం విచారకరమన్నారు. ఇప్పటికైనా జిందాల్ టాప్ యాజమాన్యం దిగివచ్చి కార్మికులందరికీ భేషరతుగా పని కల్పించాలని కోరారు. సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు రిలే నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిందాల్ జెఎసి నాయకులు పిల్లా అప్పలరాజు, గాడి అప్పారావు, నమ్మి చినబాబు తదితరులు పాల్గొన్నారు.

సినిమా థియేటర్లను ఆర్‌డిఒ ఆకస్మిక తనిఖీ

బొబ్బిలి: పట్టణంలో ఉన్న టిబిఆర్, సాయిగణపతి సినిమా థియేటర్లను మంగళవారం ఆర్‌డిఒ సాయిశ్రీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. థియేటర్లలో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. క్యాంటీన్ లో తినుబండారాలు విక్రయిస్తున్న ధరలపై ఆరా తీశారు. ప్రేక్షకులు ఇబ్బందులు పడకుండా సౌకర్యాలు కల్పించాలని, అధిక ధరలకు టికెట్లు, తినుబండారాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచాలని, సురక్షితమైన తాగునీరు సరఫరా చేయాలని కోరారు. ఆమెతో తహశీల్దార్ శ్రీనాథరావునాయుడు, ఆర్‌ఐ కళ్యాణ్ చక్రవర్తి, హెచ్‌డిటి చిన్నారావు ఉన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ సాయిశ్రీ

ఓబులయ్యపాలెంలో ఫీవర్ సర్వే

వేపాడ: మండలంలోని ఓబలయ్యపాలెంలో బొద్దాం పిహెచ్‌సి సిబ్బంది మంగళవారం ఇంటింటికీ ఫీవర్ సర్వే చేపట్టారు. గ్రామంలో జ్వరాలు అధికంగా ఉన్నాయని గుర్తించి ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 56 మందికి తనిఖీలు నిర్వహించగా జ్వర పీడితులు 11 మంది, ఆర్‌డిటి టెస్టులు 26 మందికి, డెంగీ టెస్టులు 18 మందికి చేశారు. 15 రోజుల క్రితం జ్వరంతో బాధపడిన వారిని 13 మందిని గుర్తించారు. వీరందరికీ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య సేవలో డాక్టర్ రమాదేవి, గ్రామ సర్పంచ్ దివనాది లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి ఆర్ కిషోర్, మలేరియా సూపర్‌వైజర్ ఎ.శ్రీనివాసరావు, పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామములో ప్రతి కాలువలను శుభ్రం చేసి వ్యాధులు ప్రబలకుండా ఈగలు దోమలు నివారణకు బ్లీచింగ్ పౌడర్‌ను పిచికారి చేశారు.

జిఒలను తక్షణమే రద్దుచేయాలి

రామభద్రపురం: పాఠశాల విద్యను అస్తవ్యస్తం చేస్తున్న జిఒలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రద్దుచేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జేకేరాజు, జిల్లా గౌరవ అధ్యక్షులు బంకురు జోగినాయుడు డిమాండ్ చేశారు. స్థానిక విద్యా వనరుల కేంద్రంలో మంగళవారం విలేఖర్లతో మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 84, 85, 117 జిఒలను తక్షణమే రద్దు చేయాలన్నారు. 2017లో టిడిపి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 29, 42 జిఒలను పునరుద్ధరించి విద్యావ్యవస్థను పరిరక్షించాలని కోరారు. ప్రాథమిక పాఠశాలల్లో 3,4,5 తరగతులు కొనసాగించాలని తెలుగు, ఆంగ్లం సమాంతర మాధ్యమాలను కొనసాగిస్తూ ఈ మేరకు కొత్త ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. జిఒ.29 ప్రకారం ఉన్నత పాఠశాలలన్నింటికీ ప్రధానోపాధ్యాయులు, పీడీ పోస్టులను ఇవ్వాలని, ప్రాథమిక పాఠశాలకు పూర్వ ప్రాథమిక పాఠశాలను అనుసంధానం చేసి శిక్షణ పొందిన ఉపాధ్యాయులను నియమించాలన్నారు. ఉపాధ్యాయ నియామకాలు చేపట్టే వరకు విద్యార్థులకు ఆటంకం లేకుండా ఖాళీ ఉపాధ్యాయ పోస్టులలో విద్యావాలంటీర్లను నియమించాలని కోరారు.

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

బొబ్బిలి: పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ ఆర్.డి నాగరాజు హెచ్చరించారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం పారిశుధ్య పనులపై సమావేశం నిర్వహించారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్.జి.టి) మార్గదర్శకాలను అనుసరించి వార్డులలో తడి చెత్త, పొడి చెత్తను సేకరించి చిత్తశుద్ధి పార్కుకు తరలించాలన్నారు. రోడ్లు, కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. ఆక్రమణలు, కుళాయి పన్ను వసూళ్లపై దృష్టి పెట్టాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి, మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

నెల్లిమర్ల: సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. మంగళవారం జిల్లా పరిషత్ గర్ల్స్ హైస్కూల్లో మలేరియా, డెంగీ, అతిసార వ్యాధులపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, అతిసార ప్రబలడానికి కారణాలు, తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ మలేరియా అధికారి సురేష్, ఫైలేరియా సిబ్బంది బాబు విశ్వేశ్వరరావు, శ్రీనివాస్, హెచ్ఎం జి.ఎం శారద, వ్యాయామం ఉపాధ్యాయులు ఆనంద్ కిషోర్ పాల్గొన్నారు.

తెర్లాం: మండలంలోని పెరుమాలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులకు మంగళవారం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వైద్యులు పాఠశాలల విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ కిషోర్ బాలికలు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు. మనం నివసిస్తున్న వీధుల్లో మురుగునీటి నిల్వలు ఎక్కడైనా ఉంటే సంబంధిత ప్రజాప్రతినిధులకు గాని, వైద్య సిబ్బందికి గాని తెలియజేయాలన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

తెర్లాం: మండలంలోని పెరుమాలి ఏపి మోడల్ స్కూల్లో మంగళవారం ఎస్ఐ ఆర్.రమేష్ విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని జీవితంలో పైకి ఎదగాలంటే ఒక లక్ష్యం కలిగి క్రమ శిక్షణ పెట్టి చదువుకోవాలని సూచించారు. మనం ఏదైనా సాధించాలనుకున్నప్పుడు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని అప్పుడు మనం ఉన్నత స్థాయికి వెళ్లగలుగుతామని విద్యార్థులకు సూచించారు. కాలేజీలో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించి బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి అప్పల నరసింహరావు, వైస్ ఎంపిపి ప్రతినిధి అప్పలరాజు, మాజీ ఎంపిటిసి జగ్గారావు పాల్గొన్నారు.

గురుకులాన్ని సందర్శించిన ఎంఇఒ

వేపాడ: మండలంలోని జబ్బునాయుడుపేట బిఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల వసతి గృహాన్ని మండల విద్యాశాఖ అధికారి పి.బాలాజీరావు మంగళవారం సందర్శించారు. అటల్ టింకరింగ్ ల్యాబ్‌లకు సంబంధించిన రికార్డులను, ప్రయోగాలలో ఉన్న పరికరాలను పరిశీలించారు. ఈ పరిశీలనలో వసతిగృహం ప్రిన్సిపల్ టియం ఫ్లోరెన్స్, సిహెచ్ రమణమూర్తి, మోడల్ టీచర్ పి. జేబీరాణి, సిఆర్‌పి, వసతిగృహం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేయాలి

బొబ్బిలి: రేషన్ షాపులలో ప్రజలకు అన్ని రకాల నిత్యావసర సరుకులను అందజేయాలని లోక్ సత్తా జిల్లా అధ్యక్షులు బాబు దామోదరరావు కోరారు. రాష్ట్రంలో టిడిపి కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్ షాపులలో కందిపప్పు, గోధుమ పిండి, రాగులు పంపిణీ చేస్తామని ప్రకటించినప్పటికి ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం స్పందించి అన్ని రకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేయాలని కోరారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో విశ్రాంత పశువైద్యాధికారి మృతి

పూసపాటిరేగ: మండలంలోని చౌడమ్మ అగ్రహారం సిపి పరిశ్రమ వద్ద జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో విశ్రాంత పశు వైద్యాధికారి మృతి చెందారు. విశాఖపట్నం జిల్లా మధురవాడకు చెందిన పక్కి నర్సింగరావు (65) స్వగ్రామం శ్రీకాకుళం వెళ్లి తిరిగి ప్రయాణంలో కారులో విశాఖ వెళుతుండగా సిపి పరిశ్రమ వద్ద విశాఖ వైపు వెళ్తున్న లారీని వెనక నుంచి బలంగా ఢీకొట్టడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. కార్ డ్రైవర్‌కి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని సుందర్ పేట సిహెచ్‌సికి తరలించారు. క్షతగాత్రులను వైద్య చికిత్స నిమిత్తం విజయనగరం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సన్యాసినాయుడు తెలిపారు.

ప్రేమించి మోసగించిన కేసులో వ్యక్తికి జైలు

బొబ్బిలి: ప్రేమించి మోసం చేసిన కేసులో వ్యక్తికి పదేళ్ల జైలుశిక్ష, రూ.30వేలు జరిమానా విధిస్తూ మహిళా కోర్టు న్యాయమూర్తి ఎన్.పద్మావతి తీర్పు ఇచ్చారు. పట్టణానికి చెందిన యువతిని ఎస్.వెంకటేష్ పెళ్లి చేసుకుంటానని ప్రేమించి మోసం చేయడంతో యువతి ఫిర్యాదు మేరకు అప్పటి సిఐ వై.రవి దర్యాప్తు చేయగా నేరం రుజువు కావడంతో పదేళ్ళ జైలుశిక్ష, రూ.30వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పినట్లు పట్టణ సిఐ ఎం.నాగేశ్వరరావు చెప్పారు.

పశుగ్రాస సాగు ద్వారా రైతు ఆర్థికాభివృద్ధి

పశు సంవర్ధక శాఖ జెడి జివి రమణ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పశుగ్రాస సాగు ద్వారా రైతు ఆర్థిక అభివృద్ధి చెందుతాడని పశువర్థక శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ జివి.రమణ అన్నారు. పశుగ్రాస వారోత్సవాలలో భాగంగా మండలంలోని ధర్మవరం గ్రామంలో గల పశువైద్యశాల ఆవరణంలో పశువర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ చలపతిరావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో జెడి జివి రమణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చగడ్డి సాగు చేయటం వల్ల దాణా ఖర్చు తగ్గుతుందని, వీటిలో ఎక్కువ ప్రోటీన్లు ఉండటం వల్ల త్వరగా జీర్ణం అయ్యి పాల ఉత్పత్తి పెరిగి పశువులు ఆరోగ్యంగా ఉండటమే కాకుండా తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందాలంటే ఈ పశుగ్రాసాలను ప్రతి రైతు కనీసం 10 సెంట్లు భూములోనైనా సాగుచేయాలని అన్నారు. ఈ విత్తనాలు 75శాతం సబ్సిడీతో 460 రూపాయల విలువ చేసే 5 కేజీల ప్యాకెట్‌ను 115 రూపాయలకే అందిస్తున్నామన్నారు. అంతర్జాతీయ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా పశువుల నుంచి మనుషులకు వచ్చే ప్రాణాంతక వ్యాధుల గూర్చి తెలియజేసి జిల్లాలో 29,800 యాంటీ రాబిస్ డోసులను (పిచ్చికుక్క వ్యాధి నిరోధక టీకాలు) అన్ని పశు వైద కేంద్రాలలో వేశామన్నారు. ఈ నెల7 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించే పశు గ్రాస వారోత్సవాలలో భాగంగా విజయనగరం డివిజన్‌కు 22 టన్నులు, బొబ్బిలి డివిజన్‌కు 5 టన్నులు పశుగ్రాస విత్తనాలు సరఫరా చేశామన్నారు. పశువులకు వచ్చే లంపి వ్యాధి నిరోధానికి 2.50 లక్షల టీకాలను సిద్ధం చేసి గత మూడు రోజుల నుంచి పశువులకు వేశామన్నారు. నాలుగు నుంచి ఎనిమిది వారాల వయసున్న ఆడ పెయ్యిలకు బ్రూసిల్లా సోస్ వ్యాధి రాకుండా ఈ నెల 20వ తేదీ నుంచి పశు వైద్య కేంద్రాల వద్ద వ్యాధి నిరోధక టీకాలు వేశామన్నారు. ప్రతి ప్రాంతీయ పశు వైద్యశాలకు 800 ఆడ పెయ్యిలే పుట్టే సెలెన్ని సరఫరా చేశామన్నారు. జిల్లాలో ఇంతవరకు 480 ఆడ పెయ్యిలు పుట్టాయన్నారు. పాడి పశువుల వృద్ధికి, రైతు ఆర్థిక అభివృద్ధి కోసం రైతు సేవా కేంద్రాల ద్వారా, పశువైద్య కేంద్రాల ద్వారా నిరంతర సేవలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం పశు వైద్యశాల అధికారిని గనివాడ హేమ, గ్రామ సర్పంచ్ గాలి సన్యాసయ్య, సచివాలయ సిబ్బంది, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై ఆరోపణలు చేస్తే సహించం

ప్రజాశక్తి - భోగాపురం

మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పల నాయుడు నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి పై లేనిపోని ఆరోపణలు చేస్తే సహించేది లేదని జనసేన నాయకులు కాకర్లపూడి శ్రీనివాస్ రాజు అన్నారు. మంగళవారం అయన నివాసం వద్ద మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. వైఎస్ జయంతి పుష్కరించుకొని పూసపాటిరేగలో విలేకరుల సమావేశం నిర్వహించి స్థానిక ఎమ్మెల్యే నాగ మాధవిపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ప్రోటోకాల్ విషయంలో మీ నాయకులు ఏం చేస్తున్నారో ముందు మీరు తెలుసుకోవాలన్నారు. కోనాడ గ్రామంలో వైయస్ విగ్రహాన్ని గుర్తుతెలియని వారు ధ్వంసం చేస్తే కూటమి నాయకులపై నెట్టడం ఎంతవరకు సమంజసమన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు వైఎస్ విగ్రహం ఒకటైన మీ సొంత నిధులతో నియోజవర్గంలో ఏ గ్రామంలోనైనా ఏర్పాటు చేశావా అని ప్రశ్నించారు. తన సొంత సొమ్ముతో 14 విగ్రహాలు ఏర్పాటు చేశానని గుర్తుచేశారు. ఎమ్మెల్యే మాధవి విద్యావంతురాలని నియోజకవర్గ సమస్యలపై పూర్తిగా అవగాహన ఉందని వాటిని అంచెలంచెలుగా పరిష్కారిస్తారని చెప్పారు. ఎమ్మెల్యే అయినా నెల రోజులు కాకముందే ఎన్నో ఏళ్ల నుంచి పరిష్కారం కాని బట్టి కాలువ పనులకు శ్రీకారం చుట్టారన్నారు. రామతీర్థంలో రాముని తల నరికితే మాట్లాడని బడ్డుకొండ ఇప్పుడు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు మీరు చేసిన అవినీతి అక్రమాలు చిట్టా విప్పేందుకు తాను ఒక్కడినే చాలని నియోజవర్గంలో ఎక్కడైనా బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు పల్లంట్ల జగదీష్, పళ్ళ రాంబాబు, గుండపు నానాజీ, సూరిబాబు, బొల్లు త్రినాథ్, పాల్గొన్నారు.

59 మంది గర్భిణులకు పరీక్షలు

ప్రజాశక్తి - కొత్తవలస

వియ్యంపేట పిహెచ్‌సిలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం 59 మంది గర్భిణులను డాక్టర్ గోపాలకృష్ణ తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ వీరిలో 26 మంది హైరిస్క్ గర్భిణులు ఉన్నట్లు తెలిపారు. ప్రతీ గర్భిణికి బీపీ, షుగర్, హెచ్‌బి, మూత్ర పరీక్షలు, హెచ్‌ఐవి, హెచ్‌బిఎస్, బరువులు, ఎత్తు తనిఖీ చేసి ఉచితంగా కాల్షియం, బి.కాంప్లెక్స్, ఐరన్, ఫోలిక్ మాత్రలు ఇచ్చామన్నారు. ప్రతీ నెల వైద్యునిచే తనిఖీ చేయించుకోవాలని, గుడ్లు, పాలు, కూరగాయలు, ఆకుకూరలు, బెల్లం, రాగి మాల్ట్, మునగాకు, వంటి మంచి పౌష్టికహారం తీసుకోవాలని, ఏ ఒక్క గర్భిణీ రక్తహీనతతో బాధ పడకూడదని సూచించారు. హెచ్‌బి లెవెల్ 8 గ్రాములు కన్నా తక్కువ ఉన్నవారికి ఐరన్ సుక్రోజ్ ఇంజెక్షన్స్ ఇచ్చినట్లు తెలిపారు. ఏ తల్లీ జన్మనిస్తూ మరణించకూడదని, ఏ బిడ్డా మరణించడానికై జన్మించరాదని తెలిపారు. పిహెచ్‌సిల్లో డెలివరీ సంఖ్య పెరగాలని ఏఎన్ఎమ్స్‌కి, ఆశ వర్కర్స్‌కి హెల్త్ ఎడ్యుకేట్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కొత్తవలస శ్రీసత్య సాయి ట్రస్ట్ సభ్యులు గర్భిణులకు మంచి పౌష్టికాహారంతో కూడిన భోజన సదుపాయం కల్పించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌ఎన్ జగదాంబ, హెచ్‌వి పద్మావతి, ఎమ్ఎల్‌హెచ్‌పిలు, ఏఎన్ఎమ్స్, ఆశ వర్కర్స్ వైద్య సేవలు అందించారు.


కొత్తవలస: ఆరోగ్యకార్డులతో గర్భిణులు, వైద్య సిబ్బంది

వేపాడ: మండల కేంద్రంలో గల ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభయాన్ వైద్య సేవలో భాగంగా గర్భిణులకు వైదాధికారిని డాక్టర్ ఏ.ధరణి, గైనకాలజిస్ట్ డాక్టర్ ఆర్ ఫణిశ్రీ తనిఖీలు చేసి అవసరమైన మందులను అందజేశారు. ఈ సందర్భంగా గర్భిణులకు బానాది గ్రామానికి చెందిన సత్య సాయి ట్రస్టు ఆధ్వర్యంలో గర్భిణులకు భోజన సదుపాయం కల్పించారు.

గ్యాస్ట్రిక్‌పై అవగాహన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

గ్యాస్ట్రిక్ వ్యాధులపై మంగళవారం స్థానిక బైరెడ్డి సూర్య నారాయణ కల్యాణ మండపంలో ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్య సంఘం ఆధ్వర్యంలో నెల్లిమర్ల, గుర్ల మండల గ్రామీణ వైద్యులకు గ్యాస్ట్రిక్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిధిగా హాజరైన మహేంద్ర హాస్పిటల్ డాక్టర్ బెవర మహేంద్ర గిరి మాట్లాడుతూ గ్రామీణ వైద్యులు వ్యాధుల పట్ల అవగాహన పెంచుకొని మెరుగైన సేవలు అందించాలని కోరారు. ఆహార అలవాట్లు కారణంగా వ్యాధులకు గురవుతున్నారు. గ్రామీణ వైద్యులు సరైన సలహాలు సూచనలు అందించి వ్యాధుల నివారణకు కృషి చేయాలని సూచించారు. ప్రస్తుతం క్లోమ గ్రంధి కేసులు ఎక్కువగా పెరుగుతున్నాయని మద్యం మసాలా ఆహారం ఎక్కువ తినడం వల్ల గ్యాస్ట్రిక్ వ్యాధులు ప్రబలుతున్నాయని దీని ఫలితంగా తీసుకున్న ఆహారం అరుగుదల కాకపోవడం, ఆకలి తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తాయని అన్నారు. ఈ లక్షణాలు ఉన్న ప్రతి ఒక్కరూ ప్రాథమిక పరిక్ష ఎండోస్కోపీ అవసరం పడుతుందన్నారు. అనంతరం సదస్సులో ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు గెద్ద చిరంజీవి మాట్లడుతూ కూటమి ప్రభుత్వం ద్వారా ఆగిన కమ్యూనిటీ పారామెడికల్ శిక్షణ తరగతులు కొనసాగించేందుకు ప్రయత్నం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ గౌరవ సలహాదారులు మమ్ముల తిరుపతిరావు, జిల్లా సహాయ కార్యదర్శి మక్కువ రమణ, ఇంచార్జ్ గురాన అప్పారావు, భవాని దివాకర్ హాస్పిటల్, ఎఒ నాయుడు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ మహేంద్ర గిరి

ఘనంగా బొత్స జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- చీపురుపల్లి

మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ జన్మదిన వేడుకలను వైసిపి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపి బెల్లాన చంద్రశేఖర్ కేక్ కట్ చేశారు. అనంతరం కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో బొత్స సత్యనారాయణ పేరున ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక బాపూజి వృద్ధాశ్రమంలో వృద్ధులకు, ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న రోగులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఇప్పిలి వెంకటనర్సమ్మ, జెడ్‌పిటిసి వలిరెడ్డి శిరీష, మండల పార్టీ అధ్యక్షుడు ఇప్పిలి అనంతం, జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, చీపురుపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, బెవర ఉమాకుమారి, కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయ కమిటీ ఛైర్మన్ ఇప్పిలి గోవింద తదితరులు పాల్గొన్నారు.

మెరకముడిదాం: మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ పుట్టినరోజు వేడుకలు మండలంలో ఘనంగా జరిగాయి. వైసిపి మండల అధ్యక్షులు, మాజీ జెడ్‌పిటిసి కోట్ల వెంకటరావు, వైసిపి నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, మాజీ డిసిఎంఎస్ చైర్మన్ ఎస్ వి రమణరాజు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. మండలంలోని అన్ని పంచాయతీల సర్పంచులు, ఎంపిటిసిలు, వైస్ ఎంపిపిలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కెవిఎస్‌ఆర్కే ప్రసాద్, తలచుట్ల హరి, బూర్లె నరేష్ కుమార్, పప్పల క్రిష్ణ మూర్తి, కందుల మల్లిఖార్జునరావు, సింగారపు రామకృష్ణ, కందుల పార్వతి, పెనుమిజ్జి అప్పలనారాయణ, గర్భాపు గబ్రియేల్ పాల్గొన్నారు


కేక్ కట్ చేస్తున్న మాజీ ఎంపి బెల్లాన చంద్రశేఖర్

డిఎస్‌పికి క్వారీ యజమానుల ఫిర్యాదు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని వావిలిపాడు, వీలుపరితి రెవెన్యూ పరిధిలో గల స్టోన్ క్రషర్, రాతి క్వారీలకు సంబంధించిన యజమానులు డిఎస్‌పి ఆర్.గోవింద రావును మంగళవారం తన కార్యాలయంలో కలిసి ఫిర్యాదు చేశారు. నేటికి 17 సంవత్సరాలుగా అన్ని అనుమతులతో వ్యాపారాలు కొనసాగిస్తున్నామని 2009లో పెదదుంగాడ రెవెన్యూ పరిధిలో గల డి ఫారం భూములకు సంబంధించిన పట్టాదారు రైతులు 5గురు 99 సంవత్సరాలు లీజుకు రూ.5.25లక్షలు తీసుకుని లీజు రాసి తమకు బాండు ఇచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుతం రాజకీయ నాయకుల ప్రమేయంతో గ్రామ సర్పంచ్‌పై ఓర్వలేనితనంతో తమను బ్లాక్ మెయిల్ చేస్తూ, ఎన్నికల సమయంలో వారికి ప్రతి క్రసర్ నుండి లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేయడం, ఇవ్వకపోవడంతో క్వారీ పనులను అడ్డుకోవడం, తప్పుడు ఫిర్యాదులు చేయడం అధికారులకు ఫిర్యాదులు, పత్రికలలో వార్తలు రాయించుకోవడం జరుగుతుందని క్వారీల యజమానులు శ్రీనివాసరావు, ప్రగతి ప్రసాద్, జివిఎస్ ప్రసాద్, పంతులు ప్రసాద్, సుంకర రాంగోపాల్, రామిరెడ్డి క్రషర్ సతీష్ రెడ్డి, కోటేశ్వరరావు ఫిర్యాదు చేశారు. తమ వ్యాపారాలకు అడ్డంకులు కలిగిస్తున్న రెడ్డి దేవుడి కుమారుడు శ్రీనివాసరావు, మండల దేవుడు కుమారుడు సత్తిబాబు, దేవుడు నాయుడు, మండల అప్పలనాయుడు కుమారుడు రామనాయుడులపై గ్రామ స్థాయిలో దర్యాప్తు జరిపి తమ వ్యాపారాలకు ఆటంకం కలిగిస్తున్న నలుగురిపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.


క్వారీ యజమానులతో మాట్లాడుతున్న డిఎస్‌పి గోవిందరావు


నాటు బళ్లును స్వాదీనం చేసుకుంటున్న రెవెన్యూ అధికారులు

12 అక్రమ ఇసుక నాటుబళ్లు పట్టివేత

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక చంపావతి నదిలో రెవెన్యూ అధికార్లు 12 అక్రమ ఇసుక నాటు బళ్ళు పట్టుకున్నారు. మంగళవారం రామతీర్ధం జంక్షన్ చంపావతి నదిలో నీటి పథకాల వద్ద ఇసుకను అక్రమంగా తవ్వి తరలిస్తున్న నాటు బళ్ళను తహశీల్దార్ డి.ధర్మరాజు రెవెన్యూ సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. నాటు బళ్ళ పట్టుకున్నప్పుడు అక్రమార్కులు తహశీల్దార్‌తో వాగ్వాదానికి దిగారు. దీంతో తహశీల్దారు పోలీసులకు సమాచారం ఇచ్చినా పోలీసులు బందోబస్తులో ఉన్నారని చెప్పడంతో అక్కడే రెవెన్యూ సిబ్బంది నిరీక్షించి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. అనంతరం ఇద్దరు పోలీసులు చంపావతి నదిలోకి రావడంతో నాటు బళ్ళు యజమానులు బల్లును అక్కడే వదిలేసి ఎద్దులను తీసుకు పోయారు. కాగా మండల మెజిస్ట్రేట్ తాగు నీటి పథకాల వద్ద ఇసుక అక్రమ తరలింపు బండ్లు పట్టుకున్నా అక్రమార్కులు బేఖాతరు చేయడం ఏమిటని స్థానికులు చర్చించుకుంటున్నారు. అనంతరం తహశీల్దార్ ధర్మ రాజు మాట్లాడుతూ తాగునీటి పథకాలు వద్ద ఇసుక తరలింపు చేయరాదని, అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కేసులు నమోదు చేసి జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఈ దాడిలో విఆర్ఒ కృష్ణ, సీనియర్ అసిస్టెంట్, విఆర్ఎ సూరి ఉన్నారు.

బ్రిడ్జి నిర్మాణంలో నాణ్యతా లోపం

బాడంగి: బాడంగి సమీపంలోని ఎత్తు బ్రిడ్జి వద్ద వేసిన రోడ్డు నాణ్యత లేకపోవడంతో దెబ్బతింది. దీంతో మంగళవారం ఆ రోడ్డు గుండా వెళుతున్న భారీ లారీ బోల్తా పడింది. ఇటీవల రైల్వే శాఖ రామభద్రపురం టు చిలకపాలెం రోడ్డును తూతూ మంత్రంగా నిర్మించింది. రైల్వే పట్టాలపైన మూడో లైన్ రావడంతో కొత్తగా బ్రిడ్జి నిర్మించినా అధికారులు నిర్మాణ పనులను పరిశీలించలేదు. దీంతో నెల రోజులు పూర్తవని బ్రిడ్జ్ చిన్న చిన్న వర్షాలకి పక్కనున్న బెర్మలు దెబ్బ తిని కుప్పకూలిపోతుంది. రోడ్డు కూడా అక్కడక్కడ కిందకి దిగిపోతుంది. ఇందులో భాగంగా వైజాగ్ నుంచి బొబ్బిలి ఫెర్రో కంపెనీకి వెళ్ళవ లసిన ఒక లారీ పక్కకు ఆపడంతో అలా సైడ్‌కి కూలి ట్రక్కు వెనుక భాగం కింద పడిపోయింది. ప్రాణహాని జరగకపోయినప్పటికీ ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. పారది బ్రిడ్జి పూర్తిగా పోవడం వల్ల రామభద్ర పురం నుంచి బాడంగి మీదుగా ఆకులకట్ట, తెర్లాం వెళ్లే రహదారులు కూడా పూర్తిగా పాడైపోయాయి. పినపెంకి నుంచి బొబ్బిలి రోడ్లు కూడా పూర్తిగా మరమ్మతులకు గురయ్యాయి. ఈ వర్షాకాలంలో ఎక్కడ ఏ వాహనం గోతుల్లో పడిపోతుందోనని ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు.


బోల్తాపడిన లారీ వెనుక భాగం

కేంద్ర మంత్రిని కలిసిన బేబినాయన

బొబ్బిలి: కేంద్ర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును ఎమ్మెల్యే బేబినాయన కలిశారు. శ్రీకాకుళంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి బొబ్బిలి వీణను బహుకరించి శుభాకాంక్షలు చెప్పారు. బొబ్బిలి నియోజకవర్గం అభివృద్ధికి సహకరించాలని కోరినట్లు బేబినాయన చెప్పారు.

లోడింగ్, అన్ లోడింగ్ కేంద్రాన్ని కొనసాగించాలి

బొబ్బిలి రైల్వే స్టేషన్‌లో వ్యాగన్ లోడింగ్, అన్ లోడింగ్ కేంద్రాన్ని కొనసాగించాలని కేంద్ర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును పట్టణ కళాసీ సంఘం కార్యదర్శి డి.వర్మ కోరారు. వ్యాగన్ లోడింగ్, అన్ లోడింగ్ కేంద్రాన్ని కొనసాగించాలని కోరుతూ మంగళవారం ఎమ్మెల్యే బేబినాయనతో కలిసి రామ్మోహన్ నాయుడును కలిసి వినతిపత్రం అందజేశారు. రైల్వే స్టేషన్‌లో ఉన్న వ్యాగన్ లోడింగ్, అన్ లోడింగ్ కేంద్రంలో 500మంది హమాలీలు, 200మంది మోటారు కార్మికులు జీవనోపాధి పొందుతున్నారన్నారు. లోడింగ్, అన్ లోడింగ్ కేంద్రాన్ని వేరే చోటకు తరలిస్తే వీరంతా ఉపాధి కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకు వెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని రామ్మోహన్ నాయుడు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కళాసీలు పాల్గొన్నారు.